ట్రక్కుల సమ్మె విరమణ

పెట్రోల్ కొరత వార్తలతో అమృత్‌సర్‌లో ఓ పెట్రోల్ బంక్ వద్ద ఇంధనం కోసం భారీగా బారులు తీరిన వాహనదారులు

మొదటిపేజీ తరువాయి...

విరమణకు ఏఐఎంటీసీ నిర్ణయం తీసుకొన్నది. ఈ మేరకు సమ్మె విరమించాలని డ్రైవర్లకు పిలుపునిచ్చింది. అన్ని సమస్యలు పరిష్కారం అయ్యాయని, ఏఐఎంటీసీతో చర్చలు జరిపిన తర్వాతనే కొత్త చట్టాన్ని అమలు చేస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని అసోసియేషన్ చైర్మన్ మల్కిత్ సింగ్ బాల్ పేర్కొన్నారు. అజయ్‌భల్లాతో సమావేశం అనంతరం సమ్మె విరమణను ప్రకటించిన ఏఐఎంటీసీ.. ట్రక్కు డ్రైవర్లు తిరిగి విధులకు వెళ్తారని ప్రకటించింది.

పెట్రోల్ కోసం బంకుల వద్ద బారులు

'హిట్ అండ్ రన్' కేసులకు కఠిన శిక్షలు ప్రతిపాదించడంపై ట్రక్కు డ్రైవర్లు భగ్గుమన్నారు. మూడు రోజుల సమ్మెలో భాగంగా మంగళవారం రెండో రోజు కూడా దేశవ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. కొత్త నిబంధనలు ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా డ్రైవర్లు విధులు బహిష్కరించడంతో రవాణా కార్యకలాపాలపై ప్రభావం పడింది. ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్ల ఆందోళనలతో బండ్లు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. దీంతో దేశవ్యాప్తంగా దాదాపు అన్ని రాష్ట్రాల్లో తీవ్ర గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. డ్రైవర్ల ఆందోళన నేపథ్యంలో వాహనదారులు పెట్రోల్ బంకుల ముందు బారులు తీరారు. ముందస్తు జాగ్రత్తగా పెట్రోల్, డీజిల్ పోయించుకొనేందుకు భారీగా క్యూలు కట్టారు. కొంత మంది అయితే ఆయిల్ కోసం బాటిళ్లు, క్యాన్లు తీసుకొచ్చారు. అకస్మాత్తు డిమాండ్‌తో ఉన్న నిల్వ అయిపోవడంతో బంకుల ముందు నో స్టాక్ బోర్డులు పెట్టాల్సిన పరిస్థితి నెలకొన్నది.



వాహనదారులు బంకులకు పోటెత్తడంతో.. ఆయా ప్రాంతాల్లో పెద్దయెత్తున ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సోమవారం కూడా పలు రాష్ట్రాల్లోని ఆయిల్ బంకుల వద్ద ఈ విధమైన పరిస్థితి కనిపించింది. డ్రైవర్ల ఆందోళనలు కొనసాగితే రోజువారీ ప్రయాణాలు, నిత్యావసర సరుకుల రవాణా, పాఠశాలలపైనా ప్రభావం పడే అవకాశం ఉన్నది.

నిండుకున్న ఇంధన నిల్వలు

'హిట్ అండ్ రన్' కేసులో అధిక శిక్ష, జరిమానాలకు వ్యతిరేకంగా జమ్ముకశ్మీర్, బీహార్, పంజాబ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో డ్రైవర్లు ఆందోళనలు చేపట్టారు. ఇంధన డిపోల నుంచి బంకులకు ఆయిల్‌ను సరఫరా చేసే వేలాది మంది డ్రైవర్లు కూడా ఈ ఆందోళనల్లో పాల్గొన్నారు. దీంతో బంకులకు ఇంధన సరఫరా నిలిచిపోయింది. మంగళవారం ఉదయానికే చాలా బంకుల్లో పెట్రోల్, డీజిల్ నిల్వలు నిండుకొన్నాయి. ఉత్తర, పశ్చిమ రాష్ట్రాల్లో దాదాపు 2 వేల బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిచ్చాయి. సరఫరా లేకపోవడంతో చండీగఢ్‌లో ఆయిల్ పంపిణీపై అధికారులు పరిమితి విధించారు. ద్విచక్రవాహనదారులకు గరిష్ఠంగా రెండు లీటర్లు, కార్లు, ఇతర వాహనాలకు ఐదు లీటర్ల వరకు మాత్రమే పోయాలని బంకు యాజమాన్యాలకు సూచించారు. హిమాచల్‌ప్రదేశ్‌లో డ్రైవర్ల ఆందోళనల ప్రభావం పర్యాటక రంగంపై పడింది. కొత్త చట్టానికి వ్యతిరేకంగా క్యాబ్ డ్రైవర్లు కూడా ఆందోళనలో పాల్గొనడంతో పర్యాటకులకు వాహనాలు దొరకడం లేదని స్థానిక మీడియా పేర్కొన్నది. డీజిల్ సరఫరా అగిపోతే, పాఠశాల బస్సులను కూడా నిలిపివేయాల్సి వస్తుందని మహారాష్ట్ర స్కూల్ బస్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ గార్గ్ తెలిపారు. కాగా, డిమాండ్లను పరిశీలిస్తామన్న స్థానిక అధికారుల హామీ మేరకు మహారాష్ట్రలోని నాసిక్‌లో డ్రైవర్లు మంగళవారం సాయంత్రం ఆందోళన విరమించారు.

కుటుంబాలు రోడ్డున పడుతాయి!

ఆందోళనల్లో భాగంగా డ్రైవర్లు మంగళవారం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో పెద్దయెత్తున నిరసనలు చేపట్టారు. బీహార్‌లోని పాట్నాలో రోడ్లను దిగ్బంధించారు. టైర్లు కాల్చి కొత్త చట్టానికి వ్యతిరేకంగా నినదాలు చేశారు. యాక్సిడెంట్ కేసుల్లో తాము 10 ఏండ్లు జైలు పాలైతే తమ కుటుంబాలు రోడ్డున పడుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. తమ కుటుంబాలను ఎవరు పోషిస్తారని డ్రైవర్లు ఈ సందర్భంగా ప్రశ్నించారు. మహారాష్ట్రలోని థాణేలో ఆందోళనకారులు ముంబై-అహ్మదాబాద్ హైవేను బ్లాక్ చేశారు. పోలీసులపై రాళ్లు రువ్విన ఘటనలో ఒక పోలీసు అధికారికి గాయాలు కాగా, పోలీసు వాహనం ఒకటి దెబ్బతిన్నది. మధ్యప్రదేశ్‌లోని ధార్‌లో హైవేటు బస్సు, ట్రక్కు డ్రైవర్లు పితంపూర్ హైవేను దిగ్బంధించారు. భోపాల్, ఛత్తీసగఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో ఆందోళనలు జరిగాయి.

నిబంధనలు సవరించాలి

భారతీయ న్యాయ సంహిత చట్టంలోని డ్రైవర్లకు వ్యతిరేకంగా ఉన్న నిబంధనలను సవరించాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. యాక్సిడెంట్ అయితే ఆ కేసులో శిక్షను ప్రస్తుతం చట్టంలో ఉన్న 10 ఏండ్ల నుంచి 1-2 ఏండ్లకు తగ్గించాలని కోరారు. అనుకోని ఘటనల కారణంగా తాము జైలుపాలైతే తమ కుటుంబాల పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. భోపాల్‌కు చెందిన గ్యాన్‌సింగ్ యాదవ్ అనే క్యాబ్ డ్రైవర్ మాట్లాడుతూ తన లాంటి క్యాబ్ డ్రైవర్లు ఎప్పుడో రాత్రికి ఇంటికి వెళ్తారని, ట్రక్కు డ్రైర్లు అయితే తమ కుటుంబ సభ్యులకు దాదాపు 15 రోజుల పాటు దూరంగా ఉంటారని పేర్కొన్నారు. చట్టానికి తాము వ్యతిరేకం కాదని, అయితే శిక్షకు సంబంధించి సవరణలు చేయాలని కోరారు. సాధారణ డ్రైవర్లు అయిన తాము చట్టంలో పేర్కొన్న విధంగా అంత భారీ జరిమానాలను ఎలా కట్టగలమని మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కు చెందిన ట్రక్కు డ్రైవర్ సయ్యద్ వాజేద్ ఆవేదన వ్యక్తం చేశారు.

సమ్మె వల్ల పాట్నాలోని సిపారా ఇంధన స్టేషన్‌లో పార్కింగ్ చేసిన ఆయిల్ ట్యాంకర్లు

కొత్త చట్టం ఏం చెబుతున్నది?

కేంద్ర ప్రభుత్వం ఇటీవల క్రిమినల్ చట్టాల స్థానంలో కొత్త చట్టాలను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. వాటిల్లో ఇండియన్ పీనల్ కోడ్(ఐపీసీ) స్థానంలో భారతీయ న్యాయ సంహిత చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఈ చట్టంలోని నిబంధల ప్రకారం.. హిట్ అండ్ రన్ యాక్సిడెంట్లు, ర్యాష్ డ్రైవింగ్ వంటివి నిర్లక్ష్యపూరిత డ్రైవింగ్ కిందకు వస్తాయి. కొత్త చట్టంలోని సెక్షన్ 106లో రెండు క్లాజులు ఉన్నాయి. ర్యాష్ లేదా నిర్లక్ష్యపూరిత డ్రైవింగ్‌తో ఒక వ్యక్తి మరణానికి కారణమై, ఘటన గురించి పోలీసులకు లేదా మేజిస్ట్రేట్‌కు సమాచారం ఇస్తే.. గరిష్ఠంగా ఐదేండ్ల జైలు శిక్ష, జరిమానా పడే అవకాశం ఉన్నదని 106(1)మొదటి క్లాజ్ చెబుతున్నది. 106(2) ప్రకారం నిర్లక్ష్య డ్రైవింగ్‌తో ఒక వ్యక్తి మరణానికి కారణమై, ఘటనపై పోలీసులు లేదా మేజిస్ట్రేట్‌కు సమాచారం ఇవ్వకుండా పారిపోయిన సందర్భంలో గరిష్ఠంగా పదేండ్ల వరకు జైలు శిక్ష, రూ.7 లక్షల వరకు జరిమానా పడుతుంది. ప్రస్తుతం హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసులు ఐపీసీ సెక్షన్ 304ఏ కింద ఉన్నాయి. దీని ప్రకారం నిర్లక్ష్యంగా వాహనం నడిపి, ప్రమాదంలో ఎవరైనా చనిపోతే గరిష్ఠంగా రెండేండ్ల జైలు శిక్ష మాత్రమే పడుతుంది. శిక్షతో పాటు జరిమానా లేదా రెండు పడే చాన్స్ కూడా ఉన్నది. కాగా, కొత్త చట్టం ప్రకారం యాక్సిడెంట్‌పై పోలీసులకు సమాచారం అందించినా లేదా బాధితుడ్ని సమీపంలోని దవాఖానకు తీసుకెళ్లిన డ్రైవర్లు కఠిన నిబంధనల కింద విచారణ ఎదుర్కోబోరని నిపుణులు చెబుతున్నారు.

సోలాపూర్‌లో ఉల్లిగడ్డల రవాణా నిలిచిపోవడంతో వాదనకు దిగిన రైతులు, వ్యాపారులు

మంటల్లో విమానం

టోక్యో, జనవరి 2: భూకంపంతో అల్లకల్లోలమైన జపాన్‌లో మరో ఘోర ప్రమాదం చోటుచేసుకొన్నది. టోక్యో విమానాశ్రయంలో మంగళవారం రాత్రి రెండు విమానాలు ఢీకొనటంతో ఒక విమానం అగ్నికి ఆహుతయ్యింది. 367 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బందితో హక్కైడో నుంచి వచ్చిన జపాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన 516 నంబర్ పౌర విమానం రన్‌వేపై దిగే సమయంలో జపాన్ కోస్ట్‌గార్డ్‌కు చెందిన విమానాన్ని ఢీకొట్టింది. దీంతో రెండు విమానాలు మంటల్లో చిక్కుకున్నాయి. మంటల్లో కాలిపోతూనే పౌర విమానం రన్‌వేపై కొద్ది దూరం దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కోస్ట్‌గార్డ్ విమానంలోని 5 మంది సిబ్బంది మరణించినట్టు ఆ దేశ అధికార వార్తా సంస్థ ఎన్‌హెచ్‌కే తెలిపింది. ఈ విమానంలో 8 మంది సిబ్బంది ఉన్నట్టు వెల్లడించింది. విమాన పైలట్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు పేర్కొన్నది. అయితే, ప్రమాదం జరిగిన వెంటనే మెరుపు వేగంతో స్పందించిన అగ్నిమాపక సిబ్బంది పౌర విమానంలోని మొత్తం 379 మందిని రక్షించారు.

టోక్యో విమానాశ్రయంలో ఘోర ప్రమాదం

- కోస్ట్‌గార్డ్ విమానాన్ని ఢీకొన్న పౌర విమానం
- వెంటనే మంటలంటుకొని అగ్నికి ఆహుతి
- కోస్ట్‌గార్డ్ విమానంలో ఐదుగురు మృతి

మంటల్లో కాలిపోతున్న జపాన్ ఎయిర్‌లైన్స్ విమానం

జపాన్‌లో 55కి చేరిన భూకంప మృతులు

జపాన్ పశ్చిమ తీరంలో సోమవారం సంభవించిన వరుస భూకంపాల విలయంలో మరణించిన వారి సంఖ్యపై స్పష్టత వచ్చింది. 55 మంది మరణించారని, మరో 16 మంది గాయపడ్డారని అధికారులు మంగళవారం వెల్లడించారు. భవనాల శిథిలాల కింద చిక్కుకొన్న వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. కొత్త ఏడాది మొదటి రోజు సోమవారం నాడు సంభవించిన ఈ విపాదంలో ఒక్కరోజులోనే 155 సార్లు భూమి కంపించినట్టు జపాన్ వాతావరణ విభాగం వెల్లడించిందని వార్తా సంస్థ ఏఎఫ్‌పీ నివేదించింది. ఇషికావా రీజియన్‌లో సంభవించిన ఈ భూకంపాల ధాటికి వేలాది భవనాలు, వాహనాలు, ఇతర మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. నష్టంపై అంచనా వేస్తున్నామని అధికారులు తెలిపారు. కాగా, కొన్ని ప్రాంతాల్లో ఇంకా నీరు, విద్యుత్తు సరఫరా పునరుద్ధరణ కాలేదు. సెల్‌ఫోన్ సర్వీసులు కూడా నిలిచిపోయాయి. విపత్తు ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల నిమిత్తం వెయ్యి మంది సైనికులను పంపామని ప్రధాని ఫుమియో కిషిదా తెలిపారు.

గత వారమంతా జపాన్‌లోనే ఉన్నాను: ఎన్టీఆర్

హైదరాబాద్: జపాన్‌లో వరుస భూకంపాల విపత్తు ఘటనపై టాలీవుడ్ ప్రముఖ నటుడు జూనియర్ ఎన్టీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తాను గత వారం అంతా జపాన్‌లోనే ఉన్నానని, సోమవారం రాత్రి హైదరాబాద్‌కు తిరిగొచ్చానని తాజా ఎక్స్ పోస్టులో తెలిపారు. భూకంప ఘటన తనను షాక్‌కు గురిచేసిందని అన్నారు. విపత్తు ప్రభావిత ప్రజలు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

నేడు గేట్ అడ్మిట్ కార్డులు విడుదల

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ) : ఐఐటీలు సహా ఇతర విద్యాసంస్థల్లో ఎంటెక్, మాస్టర్స్ ప్రోగ్రాముల్లో ప్రవేశాల కోసం నిర్వహించే గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్) పరీక్ష అడ్మిట్ కార్డులు బుధవారం విడుదలకానున్నాయి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ) వెబ్‌సైట్‌లో అడ్మిట్ కార్డులు అందుబాటులో ఉండనున్నాయి. ఈ ఏడాది 8లక్షలకు పైగా అభ్యర్థులు గేట్ రాయనున్నారు. దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 3, 4, 10, 11 తేదీల్లో గేట్ పరీక్షలు నిర్వహించనున్నారు.

శబరిమలలో 10 నుంచి స్పాట్ బుకింగ్‌లు రద్దు

శబరిమల, జనవరి 2: కేరళలోని శబరిమల అయ్యప్పస్వామి దేవాలయంలో మండల పూజను పురస్కరించుకుని అనూహ్యంగా ఏర్పడిన రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ) అప్రమత్తమైంది. ఈ నెలలో జరిగే మకరవిళక్కు (మకర జ్యోతి దర్శనం) ఉత్సవానికి అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. దానిలో భాగంగా మకరవిళక్కుకు స్పాట్ బుకింగ్‌లను అనుమతించరాదని మంగళవారం నిర్ణయించింది. జనవరి 10 నుంచి స్పాట్ బుకింగ్‌లు ఉండవని టీడీబీ అధ్యక్షుడు పాశ్‌నాథ్ తెలిపారు. వర్చువల్ క్యూ బుకింగ్‌లను కూడా మకరజ్యోతి దర్శనం జరిగే జనవరి 15న 40 వేల మందికే పరిమితం చేయనున్నట్టు చెప్పారు.

ఇంకా ఖరారు కాని రామ్‌లల్లా విగ్రహం

అయోధ్య, జనవరి 2: అయోధ్య రామ మందిరం గర్భగుడిలో ప్రతిష్ఠించే రామ్ లల్లా విగ్రహంపై నిర్వాహకులు ఇంకా తుది నిర్ణయానికి రాలేదు. స్వామి శంకరాచార్య విజయేంద్ర, ఇతర స్వాములను సంప్రదించి వారి సలహాలు, సూచనల మేరకు తుది విగ్రహ ఎంపిక ఉంటుందని రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ స్పష్టం చేసింది. ఆ తర్వాతే బాలరాముడి రూపాన్ని ప్రజలకు బహిర్గతం చేస్తామని ట్రస్ట్ ఆఫీస్ ఇన్‌చార్జి ప్రకాశ్ గుప్తా తెలిపారు. కాగా, కర్ణాటకకు చెందిన శిల్పి అరుణ్ యోగిరాజు విగ్రహం రామ్‌లల్లాగా ఎంపికైందని పేర్కొంటూ, అతడిని అభినందనలు తెలియజేస్తూ ఆ రాష్ట్ర మాజీ సీఎం యెడియూరప్ప ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దీనిపై యోగిరాజు సంతోషం వ్యక్తం చేశారు. అయితే తాను చేసిన విగ్రహాన్ని ఎంపిక చేసినట్టు అధికారికంగా ఎలాంటి సందేశం రాలేదని తెలిపారు. యోగిరాజు తయారుచేసిన విగ్రహానికే రామ్‌లల్లాగా ఎంపికయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ప్రచారం జరుగుతున్నది.

టాప్‌లేపిన హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్

ప్రపంచ ర్యాంకింగ్‌లో రెండో స్థానం

న్యూఢిల్లీ, జనవరి 2: ప్రపంచ ర్యాంకింగ్‌లో హైదరాబాద్, బెంగళూరు ఎయిర్‌పోర్టులు టాప్ లేపాయి. నిర్వహణా సామర్థ్యం, సమయపాలన అంశాలలో ప్రపంచంలోని అత్యుత్తమ విమానాశ్రయాలలో హైదరాబాద్, బెంగళూరు వరుసగా రెండు, మూడు ర్యాంకులు దక్కించుకున్నాయి. అమెరికాకు చెందిన మినియాపోలిస్-సెయింట్ విమానాశ్రయం మొదటి ర్యాంక్‌లో నిలిచింది. ఏవియేషన్ ఎనలిటిక్ సంస్థ సిరియమ్ 2023 ఏడాదికి రూపొందించిన ఆన్‌టైమ్ పెరఫార్మెన్స్ రివ్యూ (ఓటీపీ)లో భారత్ నుంచి హైదరాబాద్, బెంగళూరు, కోల్‌కతా విమానాశ్రయాలకు స్థానం లభించింది. వైమానిక సంస్థలలో ఇండిగోకు స్థానం దక్కింది.

వర్కర్లకు కాదు రాష్ట్రాలకు జరిమానా

ఆధార్‌తో 'ఉపాధి' చెల్లింపులపై కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్

న్యూఢిల్లీ, జనవరి 2: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఆధార్ ఆధారిత చెల్లింపుల విధానాన్ని(ఏబీపీఎస్) తప్పనిసరి చేయడంపై కాంగ్రెస్ పార్టీ చేసిన విమర్శలను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ మంగళవారం తీవ్రంగా ఖండించారు. వర్కర్లు ఏబీపీఎస్ విధానానికి అనుసంధానం కాకపోతే వారికి కాకుండా రాష్ట్రాలకు జరిమానా విధిస్తామన్నారు. పారదర్శకత కోసమే ఏబీపీఎస్‌ను తెచ్చామన్నారు. పని లభించకుండా ఎవరినీ అడ్డుకోమని.. కొన్ని గ్రామ పంచాయతీల్లో సాంకేతిక సమస్యలుంటే, అలాంటి వాటికి ఏబీపీఎస్ నుంచి మినహాయింపు ఇచ్చే విషయం ఆలోచిస్తామన్నారు. జిల్లా కలెక్టర్లకు ఈ విషయంలో నిర్ణయం తీసుకోవడానికి హక్కు ఉంటుందన్నారు.

26లోగా క్రిమినల్ చట్టాలు నోటిఫై

ఏడాదిలోగా అమలు

న్యూఢిల్లీ, జనవరి 2: ఇటీవల చట్ట సభల్లో ఆమోదం పొందిన మూడు క్రిమినల్ చట్టాల అమలుకు కేంద్రం కసరత్తు ప్రారంభించింది. మూడు క్రిమినల్ చట్టాలు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం (బీఎస్ఏ)లను ఈ నెల 26లోగా నోటిఫై చేసి, ఏడాదిలోగా దేశమంతా అమలు చేస్తారని ఒక ఉన్నతాధికారి మంగళవారం తెలిపారు. ఇటీవల ముగిసిన శీతాకాల సమావేశాల్లో ఈ బిల్లులకు పార్లమెంట్ ఆమోదం తెలుపగా, డిసెంబర్ 25న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. ఈ మూడు చట్టాలు నోటిఫై చేసిన తర్వాత హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, దర్యాప్తు అధికారులు, ఫోరెన్సిక్ విభాగాల వారికి శిక్షణ ఇస్తారు.

లోక్‌సభ ఎన్నికలకు ముందే సీఏఏ నిబంధనలు నోటిఫై!

న్యూఢిల్లీ, జనవరి 2: పౌరసత్వ సవరణ చట్టం-2019 (సీఏఏ) నిబంధనలను లోక్‌సభ ఎన్నికల ప్రకటనకు ముందే నోటిఫై చేస్తామని ఓ అధికారి చెప్పారు. నిబంధనలను నోటిఫై చేయగానే ఆటోమెటిక్‌గా చట్టం అమల్లోకి వస్తుందని తెలిపారు. అమల్లోకి రాగానే అర్హులు భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, పరిశీలించి పౌరసత్వాన్ని మంజూరు చేస్తామని వెల్లడించారు.

గూగుల్ మ్యాప్స్‌లోనే లొకేషన్ షేరింగ్!

న్యూఢిల్లీ, జనవరి 2: లొకేషన్ షేర్ చేయడానికి థర్డ్ పార్టీ (వాట్సాప్, టెలిగ్రాం..)యాప్‌ల అవసరం లేకుండా గూగుల్ మ్యాప్స్‌లో సరికొత్త ఫీచర్ అందుబాటులోకి తీసుకొచ్చినట్టు కంపెనీ వర్గాలు తెలిపాయి. రియల్ టైం లొకేషన్ వివరాలతోపాటు, స్మార్ట్‌ఫోన్ బ్యాటరీ స్టేటస్ కూడా ఇందులో కనపడుతుందని పేర్కొన్నాయి. కృత్రిమ మేధ (ఏఐ)తో పనిచేసే 'అడ్రస్ డిస్క్రిప్టర్స్'ను గత నెలలో గూగుల్ మ్యాప్స్‌లో ప్రవేశపెట్టారు. నగరం లోపల, శివారు ప్రాంతాల్లో లొకేషన్‌ను కనుగొనేందుకు ఇదెంతగానో దోహదపడుతుందని కంపెనీ వర్గాలు తెలిపాయి. దీనికి కొత్త అప్‌డేట్‌ను చేర్చుతూ సరికొత్త ఫీచర్ 'లొకేషన్ షేరింగ్'ను తీసుకొచ్చింది.

సూది గుచ్చకుండానే షుగర్ టెస్ట్

హైదరాబాద్: దేశంలో కోట్లాది మందిని పట్టి పీడిస్తున్న వ్యాధి మధుమేహం. ఇటీవల 18 ఏండ్ల లోపు వారూ ఈ వ్యాధిబారిన పడుతున్నారు. ఈ వ్యాధిని గుర్తించాలంటే సూది గుచ్చి శరీరంలోని రక్తాన్ని తీయాలి. ఇది రోగికి బాధ కలిగించే ప్రక్రియ. పైగా కొందరు సూదంటే చాలు భయంతో వణికిపోతారు. అయితే అలా సూది గుచ్చి రక్తం తీయనవసరం లేకుండానే తక్కువ ఖర్చుతో ఒక పరికరాన్ని కనుగొన్నారు ఏపీలోని ఏలూరు జిల్లాకు చెందిన శాస్త్రవేత్త పూసా చిరంజీవి శ్రీనివాసరావు. కేవలం చెమట ద్వారా మధుమేహాన్ని నిర్ధారించే ఎలక్ట్రో కెమికల్ పరికరాన్ని కనుగొనగా, దానిని రెండేళ్ల పాటు పరీక్షించిన ఇండియన్ పేటెంట్ అథారిటీ గత నెల 29న పేటెంట్ హక్కులు కల్పించింది. నిరుపేద కుటుంబంలో పుట్టిన శ్రీనివాసరావు ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ చదివిన ఆయన ఆంధ్రా యూనివర్సిటీలో పీజీ, తర్వాత పీహెచ్‌డీ చేసి, ప్రస్తుతం ఐఐటీ కాన్పూర్‌లో కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో సైంటిస్టుగా పనిచేస్తున్నారు. శరీరంలోని గ్లూకోజ్ స్థాయిని నిర్ధారించడానికి రక్తాన్ని తీయనవసరం లేకుండా కేవలం చెమటను పరీక్షించి నిమిషంలో ఈ పరికరంతో మధుమేహాన్ని లెక్కించవచ్చని ఆయన తెలిపారు. ఈ పరికరం అందుబాటులోకి వస్తే సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని, ఖర్చు కూడా తగ్గుతుందని శ్రీనివాసరావు చెప్పారు.

ఇక జన్యువులు ఆన్ అండ్ ఆఫ్!

టెక్సాస్, జనవరి 2: జన్యుచికిత్సలో అమెరికా పరిశోధకులు పురోగతి సాధించారు. బేలర్ మెడిసిన్ కాలేజీ పరిశోధకులు జన్యు వ్యక్తీకరణను నియంత్రించే అధునాతన సాంకేతికతను రూపొందించారు. జన్యుచికిత్సలో జన్యువులు ఎక్కువ లేదా తక్కువ ఉండటం ఇప్పటివరకూ సమస్యాత్మకంగా మారింది. అయితే, పరిశోధకులు టెట్రాసైక్లిన్ అనే డ్రగ్‌ను ఉపయోగించి జన్యువులను నియంత్రిస్తూ ప్రొటీన్ ఉత్పత్తిని డీఫాల్ట్‌గా ఆగిపోయేలా చేశారు. ఈ విధానంలో అదనపు పాలి ఏ సిగ్నల్‌తో కూడిన ఆర్ఎన్ఏ ఉంటుంది. దీంతో లైట్ స్విచ్చ్ ఆఫ్, ఆన్ మాదిరిగా జన్యువులను కూడా ఎప్పుడంటే అప్పుడు నియంత్రించవచ్చని పరిశోధకులు తెలిపారు.

అమెరికా తర్వాత ఇండియాలోనే అత్యధికం

టెక్ ఉద్యోగుల తొలగింపులో రెండో స్థానంలో భారత్

న్యూఢిల్లీ, జనవరి 2: ఉద్యోగుల తొలగింపు నామ సంవత్సరంగా 2023 చరిత్రలో నిలిచిపోయింది! లేఆఫ్-ఫై వెబ్‌సైట్ ప్రకారం గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా 2.61 లక్షల మంది టెక్ ఉద్యోగులు కొలువులు కోల్పోయారు. ఇందులో 70 శాతం మంది అమెరికాలో ఉద్యోగాలు కోల్పోగా ఆ తర్వాతి స్థానాల్లో ఇండియా, జర్మనీ, స్వీడన్, యూకే ఉన్నాయి. ఇండియాలో 18 వేల మంది ఉద్యోగులపై వేటు పడింది. ఎడ్-టెక్, ఆహారం, ఆర్థికం, రిటైల్, కన్స్యూమర్, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో ఎక్కువ మంది ఉద్యోగాలు కోల్పోయారు. 2020-23 మధ్య కాలంలో ప్రపంచవ్యాప్తంగా 5.2 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు.

మానవ వ్యర్థాలతో విమాన ఇంధనం!

న్యూఢిల్లీ, జనవరి 2: మానవ వ్యర్థాలను విమాన ఇంధనంగా మార్చే పద్ధతిని పరిశోధకులు కనుగొన్నారు. గ్లౌసెస్టర్‌షైర్‌లోని ఫియర్‌ఫై గ్రీన్ ఫ్యూయెల్స్ సంస్థ సీఈవో జేమ్స్ హైగేట్ దీనిపై స్పందిస్తూ.. ఈ ఇంధనం 92 శాతం తక్కువగా కార్బన్ డై ఆక్సైడ్‌ను విడుదల చేస్తుందని తెలిపారు. హైడ్రోథర్మల్ ద్రవీకరణ పద్ధతి ద్వారా ఈ ఇంధనాన్ని ఉత్పత్తి చేయవచ్చని చెప్పారు. అధిక ఒత్తిడి, వేడిని ఉపయోగించి 'బయోసాలిడ్స్' పద్ధతి ద్వారా మానవ వ్యర్థాలను కార్బన్ అధికంగా కలిగిన బయోచార్(ఒక రకమైన బొగ్గు), ముడి చమురుగా మారుస్తారు. ప్రాథమిక ప్రయోగాల్లో మానవ వ్యర్థాల నుంచి కిరోసిన్ ఉత్పత్తి చేశారు. దీనిపై మరింత పరిశోధనలు చేస్తున్నారు.